## క్లుప్తంగా

### సామూహిక కుంకుమార్చన



కుంకుమ పూజ చేస్తున్న మహిళలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆషాఢ బోనాల పండగ సందర్భంగా పట్టణంలోని ప్రశాంత్ నగర్ మహామైసమ్మ దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మొక్కులు చెల్లించుకోవడానికి భక్తులు భారీగా తరలివచ్చారు.

### ప్రజలకు నిరంతర సేవలు

దుబ్బాక: నియోజకవర్గ ప్రజలకు నిరంతర సేవలు అందించేందుకు దుబ్బాక క్యాంపు కార్యాలయంలో కొత్తగా వ్యక్తిగత సహాయకుడిని అందుబాటులో ఉంచుతున్నట్లు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఫోన్‌లో సాక్షితో మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్న సంకల్పంతో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నాంపల్లి జానార్దన్‌ను నియమించామన్నారు. నిత్యం క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉంటాడని, సీఎం సహాయనిధితో పాటు ఏ సమస్య ఉన్నా సంప్రదించాలని సూచించారు. అలాగే 94401 14664 కు ఫోన్ చేసి తమ సమస్య చెబితే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

### సాగునీరు అందించాలి

కొమురవెల్లి(సిద్దిపేట): దేవాదుల ప్రాజెక్టు ద్వారా తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపి పంటల సాగుకు నీరందించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైతులు జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు సరిగా కురవకపోవడంతో వానాకాలం వరినాట్లు వేసేందుకు ఇబ్బంది పడుతున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి దేవాదుల ప్రాజెక్టు ద్వారా తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపి సాగు నీరు అందించి ఆదుకోవాలన్నారు.

### ఆ భూములను స్వాధీనం చేసుకోవాలి

చేర్యాల(సిద్దిపేట): కబ్జా చేసిన భూదాన్, అసైన్డ్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలంటూ సీపీఎం, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్, తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ప్రభుత్వ చట్టాలని తుంగలో తొక్కి చేర్యాల ప్రాంతంలో 30.21 ఎకరాల ప్రభుత్వ భూదాన్, అసైన్డ్ భూమి కబ్జా చేశాడని ఆరోపించారు. ఈ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి అందే బీరయ్య, తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు భూమిగారి రాజేందర్, నాయకులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు సన్మానం

నంగునూరు(సిద్దిపేట): పదో తరగతిలో ఆరుగురు విద్యార్థులు 10 జీపీఏ సాధించడంతో పాటు 19 మంది బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికై ఆదర్శంగా నిలిచారని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సిద్దిపేటకు చెందిన బీఆర్ ఫౌండేషన్ సభ్యులు నంగునూరు ఉన్నత పాఠశాలకు ఐదు కంప్యూటర్లు, ప్రింటర్ బహూకరించగా శుక్రవారం డీఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామస్వామి, ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, నాగలక్ష్మి, మల్లికార్జున్, కన్యాలాల్, తిరుపతి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### త్వరలో అభివృద్ధి పనులకు నిధులు

ములుగు(గజ్వేల్): సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు మండలంలోని క్షీరసాగర్ గ్రామానికి చెందిన కేబీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొన్యాల బాల్‌రెడ్డి తెలిపారు. గతంలో క్షీరసాగర్ నుంచి అనంత పద్మనామ స్వామి ఆలయం మీదుగా నర్సంపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి మంజూరైన రూ.3.60 కోట్లు, కల్యాణ మండపం నిర్మాణానికి రూ.1.70 కోట్లు, డబుల్‌బెడ్రూంల నిర్మాణానికి 2.58 కోట్లు, గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణానికి మంజూరైన రూ.50 లక్షలు రద్దయినట్లు సీఎంకు వివరించానన్నారు. అభివృద్ధి పనుల కోసం నిధులు విడుదల చేస్తానని సీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాల్‌రెడ్డి

# వరిసాగు ప్రశ్నార్థకం

వానాకాలం వరిసాగు ప్రశ్నార్థకంగా మారింది. రెండు నెలలుగా రైతులు ఆశించినంత వర్షపాతం నమోదు కాకపోవడంతో వారు ఆందోళనలో ఉన్నారు. తేలికపాటి వర్షాలతో పత్తి, మొక్కజొన్న సాగుతో పాటుగా వరి నార్లు పోశారు. వర్షాలు కురుస్తాయని ఇంకా ఆశగా ఎదురు చూస్తున్నారు.

- ముదురుతున్న వరి నార్లు
- వర్షాభావంతో రైతుల ఆందోళన
- కేవలం వెయ్యి ఎకరాల్లోనే సాగు
- వానాకాలం సాగు అంచనా 23 వేల ఎకరాలు



కోహెడలో ముదురుతున్న వరి నారు

కోహెడ(హుస్నాబాద్): వ్యవసాయ, బోరు బావుల్లో నీటి మట్టం గణనీయంగా తగ్గింది. దీంతో రైతులు వరి నాట్లు కోసం సిద్ధం చేసిన వరి నార్లు ముదిరిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలు గ్రామీణ ప్రాంతంలో కురవక పోవడంతో తీవ్ర నిరాశ చెందుతున్నారు. రోహిణి కార్తె, మృగశిర కార్తె, ఆరుద్ర కార్తెలో ఆశించినంత వర్షాలు కురవకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

**కూలీలు ఉన్నా..**

వరి నాట్లు వేసేందుకు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్ తదిర ప్రాంతాల నుంచి వలస కూలీలను స్థానికులు తీసుకోచ్చారు. నీటి సౌకర్యం ఉండి రోహిణి కార్తెలో నార్లు పోసిన రైతులు సుమారు వేయి ఎకరాలలో నాట్లు వేయించారు. తగినంత వర్షపాతం లేకపోవడంతో మిగిలిన చోట్లు సాగు పనులు సాగడంలేదు. దీంతో కూలీలకు తగినంత పనిలేకుండా పోయింది. కాగా ఏటా వానాకాలం వరి సాగు సుమారు 23 వేల ఎకరాల్లో ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

### రెండు ఎకరాలకు నారు పోశా



రెండు ఎకరాలలో వరి నాటు ఎసేందుకు నారు పోశా. పొలం దున్నడానికి బాయిలో నీళ్లు సరిపడా లేవు. నారు పోసి 30 రోజులైంది. ఇప్పటికే 60 రోజులు దాటింది. నెలలోపు నాటు పడితే మంచి దిగుబడి వస్తుంది.

– కొంకటి వెంకటయ్య, రైతు, కోహెడ

### ఆగస్టు వరకు నాట్లు వేసుకోవచ్చు



ఆగస్టు 20వ తేదీ వరకు నాట్లు వెసుకోవచ్చు. దొడ్డు రకం 35 రోజులు, సన్న రకం 45 రోజుల వ్యవధిలో నాట్లు వేసుకునే అవకాశం ఉంది. దిగుబడిలో ఇబ్బంది తలెత్తదు. సన్న రకం నాట్లు పాయలుగా వేయాలి. దీంతో గాలి తగిలి పైరు దోమపోటుకు గురికాకుండా ఉంటుంది. అలాగే మార్కెట్లో వంద రోజుల వ్యవధిలో పంట వచ్చే వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.

– భోగేశ్వరస్వామి, ఏఓ, కోహెడ

# నేటి నుంచి ఆషాఢ ఉత్సవాలు



పాండురంగాశ్రమానికి వస్తున్న భక్తులు

మర్కూక్(గజ్వేల్): రెండో పండరీ పురంగా పేరు గాంచిన మర్కూక్ మండలం భవానందాపూర్‌లోని శ్రీ పాండురంగాశ్రమం 93వ ఆషాఢ ఉత్సవాలకు ముస్తాబైంది. దాతల సహకారంతో ఆలయ నిర్వాహకులు ఏటా ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు జిల్లా నుండే కాకుండా రంగారెడ్డి, హైదరాబాద్, నిజామాబాద్, యాదాద్రి భువనగిరి, కరీంనగర్, మెదక్, సంగారెడ్డి, నల్లగొండ, ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. మూడు రోజులపాటు పాండురంగాశ్రమం రామనామ స్మరణతో మారుమోగుతుంది.

**శోభాయాత్రతో ప్రారంభమై..**

కేశవాపూర్ నుంచి శ్రీ పాండురంగాశ్రమం వరకు శోభాయాత్రతో ఈసారి అత్యంత వైభవంగా ఆషాఢ ఉత్సవాలకు శ్రీ కారం చుట్టారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా కేశవపూర్ నుంచి మర్కూక్‌లోని శ్రీ పాండురంగ స్వామి మఠం వరకు శోభాయాత్రగా వచ్చారు. ఆశ్రమంలో శ్రీ రుక్మిణీ సమేత పాండురంగ స్వామికి పూజలు చేశారు. 13వ తేదీన భవానంద భారతీ స్వామికి పాదుకా పూజ, 14న సీతారామ చంద్రస్వామికి క్షీరాభిషేకం, పుష్పార్చన, 15న భవానీ రామలింగేశ్వర స్వామి వారికి శతరుద్రాభిషేకం, సామూహిక కుంకుమార్చన, 16న 93 ఆషాఢి ఉత్సవాలు ప్రారంభం, 17న తొలి ఏకాదశి మహోత్సవం, అఖండనామ సంకీర్తన, 18న ద్వాదశి అన్నపూజ, భక్తులకు అన్నప్రసాద వితరణ, ఉత్సవాలు ముగుస్తాయని, ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు.

### ఏబీవీపీ దుబ్బాక నూతన కమిటీ



ఏబీవీపీ దుబ్బాక నగర నూతన కమిటీ

దుబ్బాకటౌన్: ఏబీవీపీ ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం దుబ్బాకలో నిర్వహించారు. సమావేశానికి మెదక్, సిద్దిపేట జిల్లాల సంఘటన మంత్రి లక్ష్మీపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు వివేక్ వర్ధన్ నూతన కమిటీని ప్రకటించారు. దుబ్బాక నగర కార్యదర్శిగా పెంటం అజయ్ కుమార్, నగర సంయుక్త కార్యదర్శులుగా వివేక్, శివ, అఖిల, ఉపాధ్యక్షులుగా రాజశేఖర్, నీరజ్, చంద్రిక, సోషల్ మీడియా కన్వీనర్‌గా శ్రీనాథ్, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్‌గా నిఖిల్, మహిళా కన్వీనర్‌గా సునీత నియమితులయ్యారు.

### 45 రోజుల్లో రెండో చోరీ

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని దౌలాపూర్ గ్రామంలోని దుర్గమ్మ ఆలయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారని ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. శుక్రవారం ఉదయం గ్రామస్తులు ఆలయానికి వెళ్లి చూడగా ఆలయం తలుపులు తెరిచి ఉన్నాయి. ఆలయ తలుపులు తెరిచి ఉండటంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి విచారణ చేపట్టారు. హుండీతో పాటు అమ్మవారికి ముక్కుపుడక, బంగారు అభరణాలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. 45 రోజుల్లో రెండోసారి చోరీ కావడంతో గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

### విద్యార్థులను చైతన్య పరచాలి

సిద్దిపేటఅర్బన్: విద్యార్థులను చైతన్య పరచడానికి ఏఐఎస్ఎఫ్ ముందుండాలని జిల్లా నిర్మాణ బాధ్యులు మంద పవన్ అన్నారు. శుక్రవారం సిద్దిపేటలో నిర్వహించిన జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వాలు అవలంబించే విద్యార్థి వ్యతిరేక విధానాలను విద్యార్థి లోకానికి తెలియజేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధు, జనార్ధన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శేఖర్, సహాయ కార్యదర్శి ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై విచారణ చేపట్టాలి



వినతిపత్రం చూపుతున్న ఎల్లాయపల్లి గ్రామస్తులు

సిద్దిపేటరూరల్: పట్టాభూముల్లో అక్రమంగా చెక్‌డ్యాంలు నిర్మించి అవినీతికి పాల్పడినవారిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరుతూ చిన్నకోడూరు మండలం ఎల్లాయపల్లి గ్రామానికి చెందిన పాతరబోయిన శ్రీనివాస్, ఉడుత ఎల్లయ్య, తొట్ల నర్సింగం డీఆర్‌డీఏకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 2022 నుంచి 2024 మధ్యలో నిర్మించిన చెక్‌డ్యాంలను తమ పట్టా భూముల్లో నిర్మించారన్నారు. ఈ విషయంలో విచారణ చేపట్టాలని అధికారులను కోరగా శుక్రవారం వాటర్‌షెడ్ కమిటీ అధ్యక్షుడు మాజీసర్పంచ్, వాటర్‌షెడ్ అధికారి నూరొద్దీన్ గ్రామపంచాయతీకి రాగా విచారణ జరపకుండా అడ్డుకున్నారన్నారు. చెక్‌డ్యాం నిర్మాణంలో అక్రమాలకు పాల్పడి, విచారణకు అడ్డుపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

### అంగన్‌వాడీ ఆయాకు సన్మానం

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం మజీద్‌పల్లి 1వ అంగన్‌వాడీ కేంద్రంలో 42 సంవత్సరాలు ఆయాగా పనిచేసిన పూడూరు బాలమ్మ పదవీ విరమణ పొందింది. శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, అంగన్‌వాడీ టీచర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. బాలమ్మను ఘనంగా సన్మానించారు.



బాలమ్మను సన్మానిస్తున్న సూపర్ వైజర్ సునీత

### కార్పొరేషన్ చైర్మన్లకు అభినందనలు



పటేల్ రమేష్‌రెడ్డిలను సన్మానిస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ ఇండ్రస్టియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ నిర్మల, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డిలకు కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలిపారు. శుక్రవారం వారిని హైదరాబాద్‌లో కలిసినట్లు సిద్దిపేట, దుబ్బాక, నర్సాపూర్ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిలు పూజల హరికృష్ణ, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, ఆవుల రాజిరెడ్డి చెప్పారు.

# పూర్వ విద్యార్థికి అభినందనలు



వెంకటస్వామిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

సిద్దిపేట ఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో డిగ్రీ, ఉస్మానియా ఆర్ట్స్ కళాశాలలో పీజీ చేసిన వెంకటస్వామి జూనియర్ లెక్చరర్‌గా నియమితులయ్యాడు. ఇటీవల వెలువడిన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో బీసీ ఏ కేటగిరిలో రాష్ట్రంలో మొదటి స్థానం, జనరల్‌లో 116 స్థానంలో నిలిచాడు. స్వామిని శుక్రవారం కళాశాలలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ రెడ్డి, అధ్యాపకులు సన్మానించారు. విద్యార్థులు వెంకటస్వామిని ఆదర్శంగా తీసుకుని ఉన్నతస్థానాల్లో నిలవాలన్నారు. అనంతరం స్వామి మాట్లాడుతూ తాను గ్రూప్ -1లో ప్రిలిమ్స్ అర్హత సాధించానని, మెయిన్స్ కోసం ప్రిపేరవుతున్నట్లు చెప్పాడు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి, కనకచంద్రం, శ్రీనివాస్‌రెడ్డి, నగేష్, గంగాధర్, రాజశేఖర్, కౌసర్, సత్యనారాయణ, ఫాతిమా, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### స్వచ్ఛతపై అవగాహన



నిల్వ నీటిని పారబోయిస్తున్న మున్సిపల్ చైర్మన్ మంజుల

సిద్దిపేటజోన్: వర్షాకాలంలో విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ మంజుల అన్నారు. శుక్రవారం డ్రై డే సందర్భంగా పట్టణంలోని 31, 32 వార్డుల్లోని ప్రజలకు ఇంటింటికి మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజుతో కలిసి వెళ్లి స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ సీజనల్ వ్యాధుల బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో, ఇళ్లలో నీటిని నిల్వ ఉంచుకోవద్దన్నారు. నీరు నిల్వ ఉంటే దోమల వృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం చెరువు శివార్లలో హరిత శుక్రవారంలో భాగంగా మొక్కలకు నీళ్లు పోశారు. డెంగీ బారిన పడి చికిత్స పొందుతున్న వారిని చైర్మన్, కమిషనర్ పరామర్శించారు. వారి ఇంటి పరిసరాల్లో బ్లీచింగ్, మురికి కాల్వల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మొహిజ్, వజీర్, రాజు, అదనపు కమిషనర్ మల్లికార్జున్, మున్సిపల్ అధికారులు వనిత, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

**సీజనల్ వ్యాధులు రాకుండా..**

హుస్నాబాద్: సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని 1వ వార్డులో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ఇంటింటికి పూలు, పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్ కొంకట నళిని, కో ఆప్షన్ సభ్యుడు అయూబ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి

- జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి



ఆంక్ష రెడ్డితో దుబ్బాక యూత్ నాయకులు

దుబ్బాకటౌన్: జిల్లాలో యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్ష రెడ్డి తెలిపినట్లు యూత్ నాయకులు తెలిపారు. శుక్రవారం ఆమెను గజ్వేల్‌లో మర్యాదపూర్వకంగా కలిసినట్లు దుబ్బాక మున్సిపల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తేజ, మైనార్టీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అన్వర్ చెప్పారు. దుబ్బాక మండలంలో యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేయడానికి విధివిధానాలు, ఆలోచనలను అడిగి తెలుసుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రవేశ పెట్టిన పథకాల్లో ఎవరికైన సమస్యలు ఉంటే యూత్ కాంగ్రెస్ నాయకులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆమె సూచించినట్లు చెప్పారు.

# ఉపాధ్యాయులకు సన్మానం



రుద్రారంలో టీచర్లను సన్మానిస్తున్న తల్లిదండ్రులు

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థులను బావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎంఈఓ జోగు ప్రభుదాసు అన్నారు. మండల పరిధిలోని అందె ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్తున్న శివకుమార్, విద్యాప్రకాశ్‌లను శుక్రవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. బదిలీపై వచ్చిన నూతన ఉపాధ్యాయులు హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి, రాములు, రాజేశ్వర్‌లకు స్వాగతం పలికారు.

**రుద్రారంలో ....**

అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని రుద్రారం ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళుతున్న హెచ్‌ఎం ర్యాకం మల్లేశం, టీచర్లు అందె రాంచంద్రం, బాలకృష్ణను విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ రమేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ గోపాల స్వామి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ ఊస లక్ష్మి, హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మైలారంలో..**

వర్గల్(గజ్వేల్): మండలంలోని మైలారం హైస్కూల్ నుంచి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులు శ్రీలత, అంజిరెడ్డిలను గ్రామస్తులు శుక్రవారం సన్మానించి వీడ్కోలు పలికారు.

**కోనాపూర్‌లో..**

గజ్వేల్: గజ్వేల్ మండలం కోనాపూర్ ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు సునీతను శుక్రవారం సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు మహేశ్, అంగన్‌వాడీ టీచర్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ఆషాఢ బోనాల ఉత్సవాలు



మహంకాళి అమ్మవారు

గజ్వేల్‌రూరల్: ఆషాఢ మాసంలో నిర్వహించే బోనాల ఉత్సవాలు మహంకాళి దేవాలయంలో ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఘనంగా జరుగుతాయి. మొదటి రోజు శుక్రవారం మహాగణపతి పూజ, శ్రీ మానసాదేవికి అభిషేకం, శ్రీ మహంకాళి అమ్మవారు, మహాలక్ష్మి, మహా సరస్వతి మూల విరాట్‌లకు అభిషేకాలు, అలంకరణ, మహానైవేద్యం, హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ, చండీ పారాయణం తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## సంక్షిప్త వార్తలు

**◆ నిర్మల జగ్గారెడ్డికి అభినందనలు**

దుబ్బాక: టీజీఐఐసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నిర్మలజగ్గారెడ్డిని హైదరాబాద్‌లో శుక్రవారం దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మర్యాపూర్వకంగా కలిశారు. ఆమెకు శాలువా కప్పి అభినందనలు తెలిపారు.

**◆ విద్యార్థులకు సన్మానం**

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ ఆదర్శ పాఠశాలకు చెందిన 16 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. శుక్రవారం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు గుజ్జ రాజు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. మండలంలో 62 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.

**ట్రిపుల్ ఐటీలో..**

సిద్దిపేటరూరల్: ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులను బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు కృషి ఫలితంగానే పదో తరగతి ఫలితాల్లో నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు.

**◆ కలెక్టర్‌కు ఫిర్యాదు**

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని ఎల్లాయపల్లి పంచాయతీలో వాటర్ షెడ్ పనుల్లో అక్రమాలు జరిగాయని, వాటిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. గ్రామంలో చేపట్టిన వాటర్ షెడ్ పథకం పనుల్లో అక్రమాలు జరిగాయని గతంలో ఎంపీడీఓకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

**◆ సమస్యలు తెలపండి**

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత ప్రజలకు సూచించారు. శుక్రవారం దుబ్బాక 18వ వార్డులో బోరు వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులో నీటి ఎద్దడి ఉండటంతో బోరు వేయించామన్నారు. దుబ్బాక అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు.

**◆ మొక్కలు నాటి పచ్చదనం పెంచాలి**

హుస్నాబాద్‌రూరల్: పల్లెల్లో మొక్కలు నాటి పచ్చదనం పెంచాలని సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య అన్నారు. శుక్రవారం పందిల్ల 5జీ టౌన్ షిప్‌లో మొక్కల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వాతావరణ కాలుష్యాన్ని నిర్మూలించాలంటే మొక్కలు నాటాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు.

**◆ దేశాభివృద్ధిలో యువతే కీలకం**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దేశం అభివృద్ధిలో యువత కీలక పాత్రని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పూజల గోపికృష్ణ అన్నారు. యూత్ కాంగ్రెస్ మెంబర్ షిప్ రిటర్నింగ్ అధికారిగా నిఖిలేష్‌ను నియమిస్తూ నియామక పత్రాన్ని శుక్రవారం జిల్లా కార్యాలయంలో అందజేశారు.

**◆ ప్రొజెక్టర్, సౌండ్ సిస్టం అందజేత**

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం నాచారం ప్రాథమిక పాఠశాలలకు ప్రొజెక్టర్, జెడ్పీ హైస్కూల్‌కు సౌండ్ సిస్టం సమకూరాయి. గత ఏడాది ఎంపీటీసీ నిధులతో వీటిని పంపిణీ చేయాలని అప్పటి ఎంపీటీసీ జాలిగామ వెంకటేష్ గౌడ్ ప్రతిపాదనల మేరకు ఇవి మంజూరయ్యాయి. శుక్రవారం ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేశారు.

**◆ మందుబాబులకు జరిమానా**

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో కార్యాలయ చౌరస్తాతో పాటు పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో 31 మంది పట్టుబడ్డారు. వారిని శుక్రవారం సిద్దిపేట కోర్టులో హాజరుపరచగా విచారణ జరిపిన జడ్జి రూ.17,600 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

**◆ కరపత్రం ఆవిష్కరణ**

సిద్దిపేటకమాన్: ధర్మ సమాజ్ పార్టీ మొదటి మహాసభ సిద్దిపేటలోని బీజేఆర్ భవన్‌లో జరగనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిబాబు తెలిపారు. శుక్రవారం అంబేడ్కర్ చౌరస్తాలో మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈనెల 28వ తేదీన సిద్దిపేటలో ప్లీనరీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

**◆ విద్యార్థి దశ కీలకం**

హుస్నాబాద్: విద్యార్థి దశ చాలా కీలకమని, శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సీఐ శ్రీనివాస్ అన్నారు. మహాత్మాగాంధీ జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో శుక్రవారం మహిళల రక్షణ, నూతన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.